వైఎస్ఆర్ కడప



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 15 మే 2026


## బ్రహ్మంగారి ఆలయంలో హుండీ లెక్కింపు

బ్రహ్మంగారిమఠం మే 14 ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి హుండీలు మరియు పోలేరమ్మ గుడి హుండీలను ఆలయ ప్రాంగణంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను హుండీలు లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ జిల్లాఅసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ సమీక్షంలో ఆలయం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పర్యవేక్షణలో భక్తుల సేవ సమితి వారు హుండీలను లెక్కించగా 40 లక్షల 30 వేల 468 రూపాయలు నగదు, నాలుగు గ్రాముల బంగారం,100 గ్రాముల వెండి మఠం నకు ఆదాయం వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరయ్యచారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ జిపి బ్యాంకు సిబ్బంది చెన్నూరు భక్త బృందం ఆలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

దువ్వూరు, మే 14, ప్రభాతవార్త:



మండల పరిధిలోని మదిరేపల్లె గ్రామంలో ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుతాయని శాస్త్రవేత్తలు అంచనా వేయడంతో ప్రకృతి వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల విధానంలో రైతులకు ఏఎండీఎస్ విభాగంలో విత్తన గింజలు తయారు చేయు విధానాన్ని గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సిబ్బంది వెంకట కళ్యాణి, చంద్రమ్మలు ఎలా విత్తనాలు చల్లాలి, వాటిని ఎలా సాగు చేయాలనే వివరాలను సూచించారు. 30 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి భూసారం పెంచుకొనుటకు భూమిలో వెదజల్లారు. దీని వలన సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమి సారవంతం అవుతుందని తెలిపారు. సూక్ష్మజీవులు అభివృద్ధి చెందితే భూమికి రావలసిన పోషకాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట సురేష్, ఆదిలక్ష్మి, రమాదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కడప మెగా సోలార్ పార్క్ పరిధిలో

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కడప, మే 14 ప్రభాతవార్త :



కడప అల్ట్రా మెగా సోలార్ పార్క్ (1000 మెగావాట్లు) పరిధిలో స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన "4వ స్థానిక ప్రాంత అభివృద్ధి కమిటీ" సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ పార్క్ పరిధిలో ప్రభావిత గ్రామాలు, ప్రభావితం కాని గ్రామాల అభివృద్ధికి ఇప్పటివరకు అందుబాటులోకి వచ్చిన నిధులతో చేపట్టిన పలు రకాల పనులు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంకా అదనంగా ఉన్న నిధులతో గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పూర్తయిన పనులకు సంబంధించిన వినియోగ ధృవపత్రాలు వెంటనే సమర్పించాలని అమలు సంస్థలను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు విడుదల చేసిన నిధులకు సంబంధించి పనుల పురోగతి, నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించడం ద్వారా తదుపరి నిధుల విడుదల సులభతరం అవుతుందని చెప్పారు. మంజూరైన నిధులతో గ్రామ సచివాలయ సముదాయాల అభివృద్ధి, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, కాంపౌండ్ వాల్లు, పార్కింగ్ టైల్స్, ప్లేగ్రౌండ్ లెవలింగ్, వెటర్నరీ భవనాల అభివృద్ధి వంటి పనులను చేపట్టేందుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే పనులను మాత్రమే ఎంపిక చేస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, గ్రామ సచివాలయాలు, కమ్యూనిటీ భవనాలు, ఆరోగ్య సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. సోలార్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులతో సమాజానికి అవసరమయ్యే అభివృద్ధి పనుల కోసం డెవెలపర్స్ నుండి సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా స్మార్ట్ కిచెన్ వ్యవస్థ కోసం 4 ఫుడ్ డెలివెరీ ట్రక్కులు, స్కిల్ డెవెలప్మెంట్ భవనాన్ని నిర్మించేందుకు ఆయా కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ప్రతిపాదించిన పలు కొత్త అభివృద్ధి పనుల ప్రతిపాదనలు కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ప్రభావిత గ్రామాలు, ప్రభావితం కాని గ్రామాల వారీగా ప్రతిపాదనలను పరిశీలించి కమిటీ ఆమోదం కోసం ఉంచినట్లు వెల్లడించారు. సోలార్ పార్క్ పరిధిలోని గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా నిధులను వినియోగిస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోలార్ పవర్ కార్పోరేషన్ లిమిటెడ్ ఎస్ఈ ఎం. శివశంకర్ నాయుడు, సీనియర్ ఇంజనీర్/సివిల్ అశోక్ కుమార్, సీపీవో హజరతయ్య, సోలార్ ప్రాజెక్టు డెవలపర్స్, తదితరులు పాల్గొన్నారు.

## కంటి క్యాన్సర్‌పై ఎల్వీపీఈఐ వైటథాన్ అవగాహన




కడప కార్పోరేషన్ మే 14 ప్రభాతవార్త:

పిల్లల్లో కనిపించే ప్రమాదకర కంటి క్యాన్సర్ వ్యాధి రెటినోబ్లాస్టోమా పై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించే అవగాహన కార్యక్రమానికి సంబంధించిన టీ షర్ట్‌ను గురువారం కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఆవిష్కరించారు. కడప ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పిల్లల కళ్లలో తెల్లటి ప్రతిబింబం కనిపించడం, చూపు సమస్యలు, కంటి వాపు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. రెటినోబ్లాస్టోమా వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా పిల్లల చూపు తో పాటు ప్రాణాలని కూడా కాపాడవచ్చని పేర్కొన్నారు. ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రాజ శేఖర్ రెడ్డి, కడప కాంపస్ డైరెక్టర్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి మాట్లాడుతూ వైటథాన్ కార్యక్రమం ద్వారా రెటినోబ్లాస్టోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, చిన్నారుల్లో కంటి పరీక్షల ప్రాముఖ్యతను వివరించే ప్రధాన ఉద్దేశ్యమని, సమాజంలో ప్రతి ఒక్కరూ చిన్నారుల కంటి ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గాలేరు నగరి, అన్నమయ్య

# ప్రాజెక్టు పూర్తితో రాజంపేట సశ్యామలం



సభలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జగన్ రాజు

రాజంపేట, మే 14 ప్రభాతవార్త

పార్టీకి అండగా నిలిచిన ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తామని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. పార్టీకి కంచుకోటగా ఉన్న గ్రామాల అభివృద్ధికి మండలంలోనే అత్యధికంగా నిధులు కేటాయించామని తెలిపారు. అదే విధంగా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పనులు త్వరలోనే మొదలు అవుతాయని, అదేవిధంగా గాలేరు నగరి ప్రాజెక్టు ప్రధాన కాలువ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని అందుకు ప్రపంచ బ్యాంకు నిధులు కూడా మంజూరు చేస్తున్నారని ఈ మేరకు చంద్రబాబునాయుడు ప్రకటించారని ఆయన వెల్లడించారు. దీంతో రాజంపేట ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. మందరం, వరదయ్యగారిపల్లెలో తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ సమావేశాల కార్యక్రమంలో భాగంగా పార్టీ ముఖ్య నాయకులతో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు పర్యటించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం అని అంతేకాకుండా ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వరదయ్యగారి పల్లెలు రోడ్ల అభివృద్ధికి ఇంకా పూర్తి చేయాల్సిన రోడ్ల పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు పార్టీ నాయకులు వివిధ సమస్యలను దృష్టికి తీసుకుపోగా త్వరలోనే అన్నింటిని పరిష్కరించి ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఐక్యతతో కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అమలు చేస్తూ అందరినీ తమ ఆడపడుచులుగా భావిస్తూ ఉదారంగా ఆదుకుంటున్నారన్నారు. అంతకముందు ఆయా గ్రామ పార్టీ సమావేశాల నందు వరదయ్యగారి పల్లె స్మశానానికి ప్రహరీ గోడ నిర్మాణం, త్రాగునీటికి బోర్లు, వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, మార్కెట్ వైస్ చైర్మన్ కర్నాటకం చెంగల్ రాయుడు, సింగల్ విండోల్ చైర్మన్ ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, పోలి నీటి సంఘం చైర్మన్ నాగినేని నాగేశ్వరరావు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు బాపన నాయుడు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మల్లికార్జున నాయుడు, ఎంపీటీసీ నాగార్జున, మండల క్లస్టర్ ఇంచార్జ్ దగ్గుపాటి వెంకటేశ్వర్లు నాయుడు, సొసైటీ డైరెక్టర్ పరుశురాం నాయుడు, మండల కో క్లస్టర్ ఇంచార్జ్, వరదయ్య గారి పల్లె గ్రామ అధ్యక్షులు కామినేని సతీష్ నాయుడు, వరదయ్యగారి పల్లె మాజీ సర్పంచ్ శ్రీహరి నాయుడు, వరదయ్య గారి పల్లె బూత్ కన్వీనర్ కేసి నాయుడు, సీనియర్ నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు, దాసరి కళాధర్, మందరం గ్రామ అధ్యక్షులు శంకర్ రాజు, బూత్ కన్వీనర్ రాంప్రసాద్ ముదిరాజ్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, గ్రామ నాయకులు రమేష్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సంపతి కృష్ణ, చిన్నయ్య, డీలర్ వెంకటయ్య, మారోతు సుబ్బ నరసయ్య, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వాసవి సర్కిల్ ఏర్పాటుకు చర్యలు



సర్కిల్ ను పరిశీలిస్తున్న దృశ్యం

పులివెందుల, మే 14, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డులో వాసవి సర్కిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో పురపాలక సంఘం కమిషనర్ గురువారం సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. సర్కిల్ ఏర్పాటుకు అనువైన స్థలం, రహదారి విస్తీర్ణం, ట్రాఫిక్ సౌకర్యాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వాసవి సర్కిల్ నిర్మాణం ద్వారా పట్టణ సౌందర్యం పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్ కృష్ణ పాల్గొని వాసవి సర్కిల్ ఏర్పాటుపై తన అభిప్రాయాలను తెలియజేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పట్టణ అభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**జూన్ 12 నాటికి మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయాన్ని సిద్ధం చేయాలి**


4వ పేజీలో


ఎస్ఎస్ మాల్ అవినీతి వ్యవహారంలో

# దొందు దొందే

ప్రొద్దుటూరు మే 14, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని ఎస్ఎస్ మాల్ హ్యాపీ కాంప్లెక్స్ అవినీతి వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మరియు కాంప్లెక్స్ యాజమాన్యానికి లోపాయికారీ ఒప్పందం ఉందని టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గురువారం తన నివాసంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ మాల్ విషయంలో మాజీ ఎమ్మెల్యేకు దాదాపు రెండున్నర కోటి రూపాయల డబ్బు అందినట్లు తాను చేసిన ఆరోపణ ఎస్ఎస్ మాల్ వారు చెల్లించాల్సిన బిపిఎస్ మొత్తం విషయంలో అందించారని కాదని, ఎస్ఎస్ మాల్ నిర్మాణం సమయంలో ఇసుక ఇబ్బంది నేపథ్యంలో కుందూ పెన్నా వరద కాలువ పనులు జరుగుచున్న నేపథ్యంలో అక్కడి నుంచి ఇసుక తెప్పించేందుకు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు లేకున్నా, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకున్నా విద్యుత్ కనెక్షన్, అనుమతుల మంజూరు కోసం, అప్పట్లో ఎమ్మెల్యేగా వున్న రాచమల్లు ఈ మాల్ వారికి రాజకీయంగా అడ్డు రాకుండ వుండేందుకు, కాగా నంద్యాల ఎస్.బి.ఐ లో ఈ మాల్ భూమికి లోన్ వుండగా, స్థానిక ది ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లో ఆ మాల్ కు తిరిగి లోన్ ఇప్పించేందుకు ఇలా పలు అంశాలపై ఆయనకు ఆ నగదు ముట్టిందని వివరించారు. తాను లోన్ విషయాన్ని రిజర్వ్ బ్యాంకు కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కాగా ఎస్ఎస్ మాల్ ఓనర్లలో ఒకరైనా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కుమారుడు నంద్యాల కొండారెడ్డి బిపిఎస్ డబ్బులు ఇప్పుడే చెల్లించి వారి నిజాయితీ నిరూపించుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. కాగా గత వైసీపీ పాలనలో టిడిపి పార్టీ కార్యకలాపాలలో పాలు పంచుకోని వారు, పార్టీకి దూరంగా ఉన్న వారు తనపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా వుందన్నారు. దాదాపు 30,000 మంది సైన్యం వుందని చెప్పే వారు గత ప్రభుత్వంలో ప్రస్తుత ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని, ఆయన సోదరుడు, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డిని అరెస్టు చేసిన సమయంలో ఏమయ్యారని ప్రశ్నించారు. తన అనూనయులు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పంపితే వారిపై కేసులు నమోదు చేయించిన విషయాన్ని అధిష్టానానికి తెలుపుతానన్నారు.

## గోవులను గోశాలలకు తరలించండి

వేంపల్లె మే 14 ప్రభాతవార్త



పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగజేస్తున్న గోవులను గోశాలలకు తరలించాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషన్‌రెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు వేసే చెత్తచెదారం తో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు తిని అరిగించుకునే శక్తి లేక మృత్యువాతపడుతున్నాయని అన్నారు. గోవులలో సకల దేవతలు కొలువై ఉన్నాయని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయని అన్నారు. అలాంటి శాస్త్రాలను హిందూ సమాజం పాటిస్తూ వస్తోందని అన్నారు. గో హత్య మహా పాతకం అని, గోవుల అక్రమ రవాణా, గోవధ పశు సంరక్షణ చట్టం 1977 ప్రకారం ఏ ప్రాంతంలో కూడా గోవులను వదించడం అక్రమంగా తరలించడం వంటి పనులు చేయకూడదనే ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. సదరు ఆదేశాలు పట్టణంలో అమలు పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. హిందువుల మనోభావాలను గౌరవించాలని అధికారులను కోరామన్నారు. గోవధ లాంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ బిజెపి నాయకులు మునగల చంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

# హనీ ట్రాప్ కేసులో అరెస్ట్

బద్వేలు, మే 14 (ప్రభాతవార్త):

మున్సిపాలిటీ పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన ఊరీబిండి అశోక్ చెన్నైలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. అశోక్ ఇన్స్టాగ్రామ్ ఐడికి కొద్ది రోజుల క్రితం ఓ సందేశం వచ్చింది. దీనిని అశోక్ పెద్దగా పట్టించుకోకపోవడంతో గూడెం గ్రామానికే చెందిన రామలింగారెడ్డి సదరు మేసేజ్ పంపిన వ్యక్తి తన బందువుగా అశోక్‌కు పరిచయం చేశాడు. ఈ నేపథ్యంలో మెసేజ్ పంపిన గోవిందు మానస అనే మహిళ తన పేరు పూజితారెడ్డిగా పరిచయం చేసుకుని అశోక్ వద్ద ప్రేమ పేరుతో నమ్మించి తన కుటుంబ సభ్యులకు సమస్యలున్నాయంటూ పలు దఫాలుగా అశోక్ వద్ద నుంచి సుమారు 81లక్షలా 67వేలు రూపాయలు వసూలు చేసింది. తాను మోసపోయినట్లు గ్రహించిన అశోక్ సదరు విషయమై బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న సీఐ రామక్రిష్ణ కేసు నమోదు చేశారు. కేసులో ముద్దాయిలుగా ఉన్న ఆదూరి రామలింగారెడ్డి, గోవిందు మానస అలియాస్ పూజిత అనువారిని గురువారం బద్వేల్ సమీపంలోని చెన్నంపల్లె ఫ్లై ఓవర్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా ఈ డబ్బును రామలింగారెడ్డి బెట్టింగులకు వాడినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఆయన తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళా భద్రతపై అవగాహన

\- పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్



పెండ్లిమర్రి, మే 14, ప్రభాతవార్త:

జిల్లా పోలీసు యంత్రాంగంమహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలు, వర్కింగ్‌ఉమెన్స్ హాస్టళ్లలో, మహిళలు ఉద్యోగాలు చేసే కంపెనీలలో గ్రామాలలో కాలనీలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యతను మరియు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై పెండ్లిమర్రి పరిధిలోని వెల్లటూరు గ్రామంలో గురువారం మహిళలకు ఎస్సై తులసీ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చున్నారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112కుకాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రించారు. డయల్ 112 (అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098(పిల్లల రక్షణ), గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో ఎస్సై తులసీ నాగప్రసాద్ వివరించి చైతన్యవంతులను చేశారు.

## పొదుపు మంత్రం మహానాడుకు వర్తించదా ?

వేంపల్లి: మే 14 ప్రభాతవార్త



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వల్లిస్తున్న పొదుపు మంత్రం టిడిపి మహానాడుకు వర్తించదా? అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి చంద్రబాబును, టిడిపి నాయకులను సూటిగా ప్రశ్నించారు. గురువారం వేంపల్లి లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 27,28, 29 తేదీలలో నెల్లూరులో తెలుగుదేశం పార్టీ మహానాడును నిర్వహిస్తోందని అన్నారు. 27,28 తేదీలలో 20వేల మందితో ప్రతినిధుల సభ, 29వ తేదీన 7 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని టిడిపి నిర్ణయించడం జరిగింది. అందుకు తగ్గ ట్టుగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మహానాడును అత్యంత వైభవం గా, ప్రతిష్టాత్మకంగా, టిడిపి చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించాలని టిడిపి నేతలు నిర్ణయించారు. ఇది దుబారా కాదా? అని తులసి రెడ్డి ప్రశ్నించారు. ఒకవైపు పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని ప్రధానమంత్రి మోడీ పొదుపు మంత్రం వల్లిస్తూ ఉంటే, మరొకవైపు చంద్రబాబు, టిడిపి నాయకులు మహానాడు కోసం పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని విచ్చలవిడిగా పెంచడం భావ్యమా అని తులసి రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు దీనికి సమాధానం చెప్పాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

పట్టణ మౌలిక వసతులు కల్పించడంలో

# చొరవ చూపరా...?

మైదుకూరు, మే 14, ప్రభాతవార్త:



మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు, ఇతర పనులు జరుగుతున్న పనులలో నాణ్యత లోపాలు, కల్వర్టు నిర్మాణాలు, మురికి కాలువల పూడికతీత, పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించడంలో నిర్లక్ష్యం, కడప రోడ్డు పాత సాయిబాబా గుడి దగ్గర జరుగుతున్న డ్రైనేజీ పనుల్లో త్రాగునీరు పైపులైన్ పగిలి ఈ మధ్యకాలంలో సాయినాథ్ పురం వాసులకు మురికి నీరు సరఫరా జరిగిన ప్రజల ఆవేదన తెలుపుకున్న సరైన సమాధానం ఇవ్వలేదని ప్రజలు వాపోతున్నారు. నిరక్ష్య ధోరణితో మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులు నాణ్యత లేవని సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల్లో సరైన మార్గదర్శకాలు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకపోవడంతో కడప రోడ్డు శారద స్కూల్ సందు, ఇతర సందుల మురికి నీరు డ్రైనేజీ పూడికి తీత నిరక్ష్యంతో రహదారిపై పారుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఇలా జరగకుండా ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకొని ప్రభుత్వ నియమ నిబంధనలతో పనులు చేసేలా చర్యలతో పాటు నాణ్యత లోపాలను గుర్తించి నాణ్యమైన సిసి రోడ్లు, సైడ్ కాలవలు, పనులను చేయించి ప్రజలకు ఎప్పటికీ నిలిచిపోయేలా ఆదర్శంగా పనులు చేయించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## బడి పిలుస్తోంది బడి బాట కార్యక్రమం



**సుండుపల్లె, మే 14, ప్రభాతవార్త:**
మండలంలో బడి పిలుస్తోంది, బడిబాట కార్యక్రమంలో భాగంగా పూజారివాండ్లపల్లె కొత్తకుంట హరిజనవాడ మరియు సరెడ్డిగారిపల్లె హ్యాబిటేషన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల ఏంఇఒ. రవీంద్రనాయక్ తెలియజేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు 1 వ తరగతి మరియు ఆరవ తరగతి విద్యార్థులను పాఠశాలలో చేరే విధంగా విద్యార్థులు తల్లి దండ్రులుతో మమేకమై మోటివేట్ చేయడం జరిగిందని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుంతరాచపల్లె ఉపాధ్యాయులు మరియు సిఆర్ఎంటి పాల్గొనడం జరిగింది

## వెలుగుపల్లిలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం

**సిద్ధవటం, మే 14 ప్రభాతవార్త**
క్షయ వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని జాగ్రత్తలు సలహాలు తప్పనిసరిగా పాటిస్తే క్షయ వ్యాధి దరిదాపుల్లోకి రాదని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు మండలంలోని వెలుగు పల్లి గ్రామంలో గురువారం ముక్తభారత్ అభియాన్, క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంనిర్వహించారు ఈ సందర్భంగా పి కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన పేషెంట్లు తుమ్మినప్పుడు, తుంపర్ల ద్వారా వైరస్ వ్యాప్తి చెంది ఇతరులకు క్షయ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని రైల్వే స్టేషన్లు, దేవాలయాలు, చర్చిలు బస్టాండ్ లో జనసంద్రోహం ఉన్న ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రతి ఒక్కరూ మాస్కు తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనకై ఉచితంగా ప్రజలకు ఎక్రే తీయిస్తున్నామని తెలిపారు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ టిబి వ్యాధి ఎలా సోకుతుంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు చెప్పామని వ్యాధి సోకిన పేషెంట్లు మంచి పౌష్టికాహారం తీసుకోని ఆరు నెలలపాటు చికిత్సలు తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని టిబి వ్యాధిపై ఎవరు ఆందోళన చెందవద్దని సలహాలు సూచనలు పాటిస్తే దరిదాపుల్లోకి రాదని అన్నారు ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ రంగలక్ష్మి మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, సిహెచ్ఓ, లక్ష్మీనరసమ్మ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, సూపర్వైజర్లు వెంకటసుబ్బయ్య, శారదాదేవి ఆరోగ్య కార్యకర్తలు, శారద అంజనమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.




## మహిళని కాపాడిన పోలీసులు..

**బ్రహ్మంగారిమఠం మే 14 ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని ఉన్నటువంటి బ్రహ్మసాగర్ రిజర్వాయర్లో పడేందుకు వెళ్ళిన ఆళ్లగడ్డకు చెందిన షేక్ సైదాబి, మానసిక స్థితి సరిగా లేక రిజర్వాయర్లో దూకి చనిపోవాలని వెళ్లినట్లు పోలీసులకు సమాచారం




తెలియడం ఏఎస్ఐ సుధాకర్ హుటాహుటిన తమ సిబ్బందిని అప్రమత్తం చేసి షేక్ సైదాబీని కాపాడడం జరిగింది. రక్షించిన ఆమెకు మానసిక స్థితి సరిగ్గా లేదని ఆమె భర్త పోలీస్ లకు తెలిపారు. ఆమెను భర్త షేక్ మాలిక్ భాష కు అప్పగించడం జరిగింది. ఏఎస్ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, హోంగార్డు నాగరాజు పాల్గొన్నారు. సమయస్పూర్తితో క్షణాల్లో స్పందించి తన భార్యను కాపాడిన బ్రహ్మంగారిమఠం పోలీస్లకు షేక్ మాలిక్ భాష కృతజ్ఞతలు తెలియజేశారు.

## నీట్ పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

**ఎడ్యుకేషన్ మే 14 ప్రభాతవార్త :**
నీట్ పరీక్షలు రద్దు చేయడం సిగ్గుచేటని విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏ. ఐ. యస్. బి. కన్వీనర్ జయవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత సంవత్సరం కూడా నీట్ పరీక్ష పత్రం లీక్ కారణంతో నీట్ పరీక్ష రద్దు అయిన విషయం తెలిసిందే అని, మళ్లీ ఈ సంవత్సరం కూడా నీట్ స్కామ్ బయటపడటం ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని వారు వాపోయారు. పదేపదే పునరావృతమవుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, జాతీయ పరీక్షా సంస్థ నిరక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందని వారు ఆవేదన చేశారు. 2026 మే 3న జరిగిన నీట్ పరీక్ష తర్వాత; రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో 'గెస్ పేపర్' పేరుతో సోషల్ మీడియాలో తిరిగిన ప్రశ్నా పత్రం అసలు ప్రశ్నాపత్రంతో సరిపోలినట్లు తెలడం సిగ్గుచేటని వారు దుయ్యాబట్టరు . ఆ గెస్ పేపర్లోని 100కు పైగా ప్రశ్నలు అసలు పరీక్షలో వచ్చినట్లు దర్యాప్తులో బయటపడడం, అదేవిధంగా గత సంవత్సరం మాదిరిగానే లీకైన ప్రశ్నాపత్రాలను రూ.30 వేల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయించినట్లు వారు ఆరోపించారు గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న నీట్ స్కామ్లపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పదేపదే జరుగుతున్న ఈ స్కామ్లను పూర్తిగా అరికట్టాలని, నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్టిఏను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, సుశాంత్, ఉదయ్ భాస్కర్, మస్తాన్, గోపాల్ రెడ్డి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యుడైస్ నిర్ణయం ప్రైవేట్ పాఠశాలలకు ఇబ్బందికరం

### ఎంఈఓకు కరస్పాండెంట్ల వినతి

**మదనపల్లెక్రైమ్, మే 14, ప్రభాతవార్త.**
ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రమేయం లేకుండా, విద్యార్థులను యుడైస్ నుండి తొలగించడం, నేరుగా టీసీలు మంజూరు చేయాలని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం ప్రైవేట్ విద్యాసంస్థలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని పలువురు పాఠశాలల కరస్పాండెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మదనపల్లె మండల విద్యాశాఖ అధికారి ఎం. ప్రభాకర్ రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యోదయ కరస్పాండంట్ శ్రీనివాసులు నాయుడు, న్యూ లిటిల్ ఫ్లవర్ రామకృష్ణ రెడ్డి, సాయి విద్యానికేతన్ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ.. గతంలో సుప్రీంకోర్టు ఏదైనా విద్యార్థి ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలకు మారాలంటే, సదరు పాఠశాలకు చెల్లించాల్సిన ఫీజు బకాయిల్లో కనీసం 50 శాతం చెల్లించి టీసీ తీసుకోవాలని తీర్పు ఇచ్చిందన్నారు. మిగిలిన మొత్తాన్ని ఆరు విడతలలో చెల్లించేలా, ఆయా కరెస్పాండెంట్ల అనుమతితోనే చైల్డ్ ఇన్ఫో, యుడైస్లో నమోదు చేయాలని స్పష్టమైన తీర్పు ఉందన్నారు. అయితే, ప్రస్తుత విద్యాశాఖ ఆదేశాలు కోర్టు తీర్పునకు భిన్నంగా ఉన్నాయని, కరస్పాండెంట్ల అనుమతి అవసరం లేదనడం ప్రైవేట్ పాఠశాలల మనుగడకే ప్రమాదకరమని వారు పేర్కొన్నారు. తుది నిర్ణయంపై జిల్లా, రాష్ట్ర



విద్యాశాఖ అధికారులు పునరాలోచించాలని కరస్పాండెంట్లు కోరారు. దీనిపై ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రైవేటు పాఠశాలలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మర్షి, కేశవరెడ్డి పాఠశాలల ప్రతినిధులు, ఎస్వీఎల్ ప్రవీణ్, డైమండ్ చక్రపాణి, విజేత శ్రీనివాస శర్మ తదితర ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## బోనుమలలో రెవెన్యూ గ్రామ సభ

**చిన్నమండెం మే 14 ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని బోనుమల గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ తహసీల్దార్ రామాంజులు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో ఒక నెల పాటు ప్రతి గురువారం 4 వారాల పాటు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా రెండవ వారం గ్రామ సభను నిర్వహించారు. దీనిని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించు కోవాలని రైతులకు సూచించారు. అడంగల్ రాని వారు మ్యూటెషన్, బాగ పరిష్కారాలు కానీ వారు ఇంకా ఎలాంటి భూ సమస్యల వున్నా ఈ గ్రామ సభల ద్వారా పరిష్కారం చూపడం జరుగుతుందని చెప్పారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో, మండల సర్వేయర్ శ్యామల, మాజీ సర్పంచ్ చెన్నకృష్ణా రెడ్డి , ఆనంద రెడ్డి గ్రామ విఆర్ఓ ప్రజలు పాల్గొన్నారు.



## కోటకొండ గంగమ్మ జాతరలో చాందిని బండ్ల మెరవణి

**తంబళ్లపల్లె మే 14 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె ఒక సమీపంలోని కోటకొండ గంగమ్మ జాతరలో బుధవారం రాత్రి చాందిని బండ్ల మెరవణి, ప్రత్యేక వాయిద్యాలు, బాణ సంచా పేలుళ్ల, కోలాటాలు, చెక్క భజనలు, పోతుల రాజు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గురువారం కోటకొండ గంగమ్మ తల్లి ఊరేగింపులో వందలాదిగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.



## బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం



**యర్రగుంట్ల మే 14, ప్రభాతవార్త:**
పోలీస్స్టేషన్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న నలుగురికి వీడ్కోలు సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ విశ్వనాథ్ రెడ్డి సిబ్బందితో కలిసి ఏఎస్ఐలు రాజారెడ్డి, అబ్రహం, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుల్ సుబ్బయ్య లకు శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఉద్యోగం అనేది అన్ని ప్రభుత్వ ఉద్యోగాల కంటే చాలా కీలకమైనది అన్నారు. ఇంతకాలం ఇక్కడ చాలా క్రమశిక్షణ పనిచేసి మంచి పేరు సంపాదించడం మన స్టేషన్ కి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగ మురళి, ఎస్సై టు రామాంజనేయులు. హెడ్ కానిస్టేబుళ్ల ఆల్ఫ్రెడ్. ఓబులేసు. కానిస్టేబుళ్ల ఖాదర్ బాషా. ప్రసాద్ రెడ్డి. చంద్ర. జయంతి. సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలపై అత్యాచారాలు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావిత్రి




సమావేశంలో మాట్లాడుతున్న సావిత్రి, సమావేశంకు హాజరైన మహిళలు

**మదనపల్లె, మే 14 ప్రభాతవార్త :**
మహిళలపై నానాటికి పెరుగుతున్న దాడులు అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అఖిల భాతర ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావిత్రి పేర్కొన్నారు. అన్నమయ్యజిల్లా కేంద్రం మదనపల్లెలోనిఒ ఎన్జిఒహోంలో గురువారం ఐద్వా జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి సావిత్రి ముఖ్య అతిధిగా విచ్చేశారు. ముందుగా ఐద్వా జెండాను ఎగురవేసి సెల్యూట్ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో సావిత్రితో పాటు సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహాలు పాల్గొన్నారు. ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ ప్రథమ మహాసభలకు పట్టణ కార్యదర్శి రెడ్డి ప్రసన్న అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ మహిళా సమస్యలపై గళమెత్తి పాలకులను నిలదీసేందుకు ఐద్వా దేశవ్యాప్తంగా శక్తివంతమైన మహిళా సంఘంగా పనిచేస్తొందన్నారు. దేశవ్యాప్తంగా ఐద్వాలో 1.30కోట్లు మంది సభ్యులండగా ఏపీలో 4లక్షల మంది సభ్యులు కలరన్నారు. కేంద్రంతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రధాన కారణం గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాలు వినియోగం పెరిగిపోవడమే కారణం అన్నారు. ఎన్నికల ప్రచారం ఏపి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్కళ్యాణ్ మద్య నాణ్యమైనది ఇస్తామని ప్రకటించారే తప్ప మంచి తిండి వైద్యం, విద్య ఇస్తామని చెప్పలేదన్నారు. సిఎం ముగ్గురు బిడ్డలను కనాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ముగ్గురు పిల్లలను ప్రసవించి ఆ తరువాల వారిని పెంచి పోషించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య సమానత్వం, స్త్రీ విముక్తి కోసం ఐద్వా నిరంతరం పేనిచేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిలలను వంటింటికి పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో సమానత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వాచేపట్టే పోరాటాలకు సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియు ఎస్ఎఫ్ఐ, అంగన్వాడీ అశా సంగాలు అండగా ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమం లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐద్వా సభ్యులు హాజరయ్యారు.

## బూత్ లెవెల్ నుంచి పార్టీ బోలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న నాగమణి రెడ్డి

**లక్కిరెడ్డిపల్లి: మే 14 ప్రభాతవార్త**
గ్రామాల్లోని బూతు లెవల్ నుండి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు నాగమణి రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ షఫీ నాయక్ లు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి లోని 16, 18, 27, 25, 32 భూతుల్లోని పార్టీ జెండా పోల్స్ బూత్ లెవల్ నాయకులతో కలసి నాగమణి రెడ్డి మార్కెట్ యార్డు చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ పార్టీ అజెండా గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నో కంపెనీలు తెప్పించి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని పార్టీ గ్రామాలలో ప్రతి ఇంటిపైన జెండా ఎగరాలని వారి ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొని భూతిస్థాయిలో కార్యకర్తలే వెన్నుముకగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొండవీటి సింహం శంకర్ చిన్నపరెడ్డి, ముక్తార్ అహ్మద్, బోనాల ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చెస్ట్ ఎక్సరే

**యర్రగుంట్ల మే 14, ప్రభాతవార్త:**
టీవీ ముక్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యర్రగుంట్ల మార్కెట్ యార్డ్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు క్షయ వ్యాధి నిర్ధారణ కొరకు ఉచిత చెస్ట్ స్కానింగ్, ఎక్సరే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. 40 సంవత్సరాల పైబడిన ఆధార్ కార్డ్, ఆధార్కు లింక్ అయిన మొబైల్ నెంబర్ తీసుకొని రావాలని సూచించారు.

## ఒక నెల-ఒక గ్రామం" కార్యక్రమం



**నందలూరు, మే 14 ప్రభాతవార్త :**
మండలంలోని నల్లతిమ్మయ్యగారి పల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లమ రాజుపల్లి గ్రామంలో గురువారం "ఒక నెల-ఒక గ్రామం" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తాసిల్దార్ శివలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. అందిన వినతులను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడం, గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుశీల్ కుమార్, మండల సర్వేయర్ శ్రీరాములు, గ్రామ రెవెన్యూ అధికారి పెంచలయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడికి 'మన ఊరికోసం' స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం




**సిద్ధవటం, మే 14: ప్రభాతవార్త**
మండలంలోని మాధవరం1 గ్రామ పంచాయతీ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన బేల్దారి కార్మికుడు బత్తల మురళి కుటుంబానికి 'మనఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. మూడు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్కు గురైన మురళి చికిత్స కోసం కుటుంబ సభ్యులు రూ.7 లక్షల వరకు అప్పులు చేశారు. అయినా ఫలితం లేకపోవడం, తదుపరి వైద్యానికి ఆర్థికశక్తి లేక మురళి తల్లి నడిపమ్మ, భార్య పార్వతీ దిక్కుతోచని స్థితిలో కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ నిరుపేద కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న 'మన ఊరికోసం' సంస్థ సభ్యులు దాతల సహకారంతో రూ.18,000 విరాళాలు సేకరించారు. అందులో రూ.5,500 విలువైన నిత్యావసర సరుకులను, రూ.12,500 నగదును బాధిత కుటుంబానికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ.. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఈ నిరుపేద బేల్దారి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి మరికొంత మంది దాతలు ఉదారంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పుత్తా సుధీర్ రాయల్, సామల చెంగయ్య, టి. పెంచలయ్య, సుబ్బలక్షుమ్మ పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా చంద్రశేఖర్

**బ్రహ్మంగారిమఠం మే 14 ప్రభాతవార్త**
మండల కేంద్రంలో వున్నటువంటి శ్రీ వెం కటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్గా ముండ్లపాటి చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మీద వస్తున్న వా ర్తలకు స్వస్తి పలుకుతూ, మండల వ్యాప్తంగా ఉన్న



విద్యార్థులకు తల్లిదండ్రులకు అందరికీ విజ్ఞప్తి చేస్తూ మా కళాశాల ద్వారా విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందిస్తూ ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా నియమ ని బంధనలు పాటిస్తామని అన్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన కళాశాల కర స్పాండెంట్ ఎస్కే వల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మండల ప్రజల సహాయ సహకారాలతో మీ అందరి సలహాలు తీసుకొని కళాశాల అభి వృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలియజేశారు.

## 50 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఉచిత చికిత్స పొందవచ్చు



**లక్కిరెడ్డిపల్లి: మే 14 ప్రభాతవార్త**
50 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తున్న చికిత్సలు చేయించుకోవచ్చని కేంద్ర పరిశీలకుడు డబ్ల్యూహెచ్వో పరిశీలకుడు డాక్టర్ సెల్వన్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి లోని కొత్త కొట్టాలు లక్కిరెడ్డిపల్లి టౌన్ నందు సుమారు 600 మందికి షుగరు వ్యాధి, టీబీ, క్షయ వ్యాధి ఏ వ్యాధి ఉన్నవారు కూడా ఉచితంగానే ఎక్రే తీయించుకొని జబ్బును నిర్ధారించుకున్న తర్వాత డాక్టర్ దగ్గర చికిత్స చేయించుకుని ఉచితంగా ప్రభుత్వం మందులు అందిస్తుందన్నారు. అంతే కాకుండా చాలామంది మద్యం, సిగరెట్, బీడీ, గంజాయి, డ్రగ్స్ సేవించి కిడ్నీలు లివర్ గుండె సంబంధ లాంటి వ్యాధులకు గురవుతున్నారని మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఉచితంగా ఎక్రే తీసి వారికి జబ్బులు బట్టి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని చేసుకోవాలని ఆయన తెలియజేశారు. మీ ఇంటి ముందరకే వైద్యం వస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ హరి, వైద్య సిబ్బంది బేబీ, కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

## ఇంధనం పొదుపుతోనే ఆర్థిక భద్రత

### ప్రజలకు ఎద్దుల విజయసాగర్ విజ్ఞప్తి

**నందలూరు, మే 14 ప్రభాతవార్త :**
దేశంలో నెలకొంటున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రజలు ఇంధన వినియోగాన్ని తగ్గించి పొదుపు దిశగా అడుగులు వేయాలని రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలో ఎక్కడ జరిగిన సంఘటనల ప్రభావం అన్ని దేశాలపై పడుతోందని, ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం భారత్ వంటి వర్ధమాన



దేశాలపై అధికంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ముడి చమురు, సహజవాయువు కొరత కారణంగా ధరలు పెరిగి సాధారణ ప్రజలపై తీవ్ర భారం పడుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, చిన్న సూక్ష్మ పరిశ్రమలు బలహీనపడటం, విదేశీ పెట్టుబడులపై అధిక ఆధారపడటం, రూపాయి విలువ క్షీణించడం వంటి అంశాలు ఆర్థిక అస్థిరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. గ్రామీణ పరిశ్రమలు, రైతాంగానికి తగిన ప్రోత్సాహం లేకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని తెలిపారు. యువతలో నైపుణ్యాల కొరత కూడా దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా మారుతోందని పేర్కొన్నారు. శాశ్వత పెట్టుబడులు, ఉత్పాదక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల నియంత్రణతో పాటు వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## డ్రోన్ కెమెరాల నిఘా నీడలో పెండ్లిమర్రి

**పెండ్లిమర్రి, మే 14, ప్రభాతవార్త:**
జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాల వినియోగంతో పెండ్లిమర్రి మండల పరిధిలో అసాంఘిక శక్తుల కదలికలపై మరియు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యక్తులపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఈ చలానాలు విధించబడతాయి. ప్రజల భద్రత దృష్ట్యా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించబడుతుంది. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్ కోరారు.

## అభివృద్ధి పథకాలపై అవగాహన

**తంబళ్లపల్లె మే 14 ప్రభాతవార్త :**
కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పై అవగాహన చెంది సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎంపీ ప్రసాద్ కోరారు. గురు వారం కేంద్ర ముద్ర యోజన, అటల్ బీమా యోజన, యోనా కృషి, అగ్రి గోల్డ్ లోన్, సంచాయి యోజన, అగ్రిగోల్డ్, స్వనిధి, సురక్ష బీమా, జీవనజ్యోతి, అగ్రి ఇన్ ఫ్రాక్చర్, ఎంప్లాయిమెంట్ జనరేషన్ పథకాల పై ఏవో థామస్ రాజా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కార్యదర్శులు ఈశ్వర్ రెడ్డి, శ్రీనివా సరావు, హరి ప్రసాద్, టిడిపి నాయకుడు బేరిపల్లి శ్రీనివాసులు, భాస్కర్ తది తరులు పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలు పోలీస్ స్టేషన్లో తప్పనిసరి నమోదు చేసుకోవాలి

**కె.వి పల్లి, మే 14 ప్రభాతవార్త:**
కె.వి పల్లి మండలంలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలను తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లో నమోదు చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ బి. వెంకట శివకుమార్ ఆదేశించారు. భద్రతా పరమైన కారణాలు, కార్మికుల గుర్తింపు మరియు చట్టపరమైన నియంత్రణ కోసం ఈ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో పనిచేస్తున్న కాం ట్రాక్టర్లు, హోటల్ యజమానులు, ఇటుక బట్టీల యజమానులు, గోదా ముల యజమానులు తమ వద్ద పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులను మూడు రోజుల్లోగా పోలీస్ స్టేషన్కు హాజరు పరచాలని సూచించారు. కార్మికుల పూర్తి వివరాలు పేరు, శాశ్వత చిరునామా, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, ఫోటోతో పాటు యజమాని వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోగా వివరాలు నమోదు చేయని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

